సాక్షి
ములుగు
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే కేసులు

ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లయీస్ టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ ఎం.ప్రభాకర్ అన్నారు. రైస్ మిల్లుల్లో తనిఖీ చేశారు. - 8లో▸



తస్మాత్ జాగ్రత్త.. - 8లో▸

ఇటీవల ట్రయల్ రూమ్, హాస్టల్ గదుల్లో స్పై కెమెరాలు అమర్చిన ఘటనలు వింటున్నాం. అలాంటి ప్రదేశాల్లో మహిళలు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.



గరిష్టం/కనిష్టం
$31^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యువకుడి ప్రాణాలు కాపాడిన ఎస్సై



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో సూసైడ్ చేసుకున్న ఓ యువకుడిని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కాపాడారు. నల్లమొక్క రంజిత్ పస్రా సమీపంలోని అటవి ప్రాంతంలోని నీటి కుంటలో పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అతని కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి సమాచారం అందించడంతో సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా యువకుడు ఉన్న ప్రదేశాన్ని గుర్తించి అక్కడికి చేరుకున్నారు. నీటిలో పడి ఉన్న రంజిత్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించడంతో కోలుకున్నాడు. లొకేషన్ ఆధారంగా యువకుడి ప్రాణాలు కాపాడిన ఎస్సై శ్రీకాంత్ రెడ్డికి వాట్సాప్, సోషల్ మీడియాలో పలువురు అభినందనలు తెలిపారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

భూపాలపల్లి అర్బన్: సింగరేణి గైర్హాజరు కార్మికులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. ఏరియా మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఏరియా ఇన్‌చార్జ్ జీఎం కవీంద్ర హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మూడు సంవత్సరాల్లో 50 నుంచి 100 మస్టర్ల కన్న తక్కువ హాజరు గల 108 మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్‌కు పిలవగా 46 మంది హాజరైనట్లు తెలిపారు. గైర్హాజరుకు కరణాలను అడిగి తెలుసుకుని పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో అధికారులు జ్యోతి, క్రాంతికుమార్, కార్మిక సంఘాల నాయకులు బుచ్చయ్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



చిట్యాల: గ్రామాల అభివృద్ధికి ప్రతీఒక్కరు తోడ్పాటు అందించాలని డీపీఓ నారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు, కారోబార్లకు పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, ఇంటి పన్ను వసూళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కార్యదర్శులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వీరభద్రయ్య, ఎంపీడీఓ ఐత రామకృష్ణ, టేకుమట్ల ఎంపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: ఐటీఐ ప్రవేశాలకు ఐదో విడత దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు స్థానిక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ జుమ్లానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌ల్లో శిక్షణ పొందేందుకు ఫిట్టర్, కోపా ట్రేడ్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హత, ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును విరమించుకోవాలి



కాటారం: ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట తీసుకొచ్చిన రేషనలైజేషన్ జీఓను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యారంగ సమస్యలపై చర్చించి సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్ ఉద్యమాల కార్యచరణపై ఉపాధ్యాయులను సన్నద్ధం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ జీఓ 25ను పూర్తిగా అశాస్త్రీయమైందన్నారు. అనంతరం టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బొల్లం సతీశ్, ప్రధాన కార్యదర్శిగా గండు రాజబాబుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



భర్తీ ఎప్పుడో?

జిల్లాలో 94 అంగన్‌వాడీ టీచర్లు, 306 ఆయా పోస్టుల ఖాళీ

- సిబ్బంది కొరతతో సేవలకు ఆటంకం
- ఉన్నవారిపై అదనపు భారం

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ విద్యా కేంద్రాలుగా మార్చేందుకు సిద్ధమైంది. 1నుంచి 3వ తరగతి వరకు విద్యను కొనసాగించాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు యూనిఫాంలను అందించింది. కాని సిబ్బంది కొరతతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో టీచర్లు, ఆయాలు, పర్యవేక్షణ అధికారులు లేక అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల ప్రభుత్వం 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీలను విధుల నుంచి తొలగించి నూతనంగా టీచర్లు, ఆయాలను భర్తీ చేయకపోవడంతో సమస్య తలెత్తుతోంది. సెప్టెంబర్ నెలలో పోషక మాసం నిర్వహిస్తుండగా సిబ్బంది లేని కారణంగా పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించడం కష్టతరంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి.

నాలుగు ప్రాజెక్టులు

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో ములుగు, తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురం(కె) మండలాలను నాలుగు ప్రాజెక్టులుగా విభజించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగిస్తున్నారు. నాలుగు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు 94, 306 మంది ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల కొరత కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ కరువైంది.

జిల్లాలోని ప్రాజెక్టుల వారీగా ఖాళీల వివరాలు

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	టీచర్ల	ఆయాలు
ములుగు	142	20	54
తాడ్వాయి	124	24	63
ఏటూరునాగారం	206	26	101
వెంకటాపురం(కె)	168	24	88
మొత్తం	640	94	306

అదనపు భారం

అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్తిస్థాయిలో టీచర్లు, ఆయాలు లేని కారణంగా ఉన్న వారిపై అధిక భారం పడుతోంది. ఈ క్రమంలో సిబ్బంది లేని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉన్న కేంద్రాల టీచర్లు, ఆయాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఆయా అంగన్‌వాడీల టీచర్లు, ఆయాలు రెండు కేంద్రాల నిర్వహణ, విద్యా బోధన చేయలేకపోతున్నారు. దీంతో గ్రామాలలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఇటీవలనే ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్నా. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇబ్బందులు తలెత్తకుండా పక్క సెంటర్ల వారికి అదనపు బాధ్యతలు అప్పగించి సేవలు అందిస్తున్నాం. పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- శిరీష, జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమాధికారి

మెనూ పాటించడం లేదని..



మధ్యాహ్న భోజన నిర్వాహకులను ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పప్పుచారుతో విద్యార్థులకు వడ్డించిన భోజనం


నిర్వాహకులపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

మంగపేట : మండల పరిధిలోని మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో పప్పు, కూరగాయలతో కూర, గుడ్డు అందించాల్సి ఉండగా కేవలం సాంబారు పోశారని, అందులో నీళ్లు ఎక్కువగా పోయడంతో రుచికరంగా లేదని విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులను, నిర్వాహకులను నిలదీశారు. రోజు వారీగా విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ భోజనంతో పాటు వారంలో మూడు రోజులు గుడ్డు, పప్పు కూరగాయలు, సాంబారుతో రుచికరమైన భోజనాన్ని అందించాల్సి ఉండగా నిర్వాహకులు మెనూ ప్రకారం అందించడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం వెంకన్నను సైతం ప్రశ్నించడంతో మెనూ పాటించాలని నిర్వాహకులకు చెప్పినా వినిపించుకోవడం లేదని, తాము మొదటి నుంచి వండుతున్నామని ఎలా వండిపెట్టాలో తమకు తెలుసని అగౌరవంగా మాట్లాడడంతో పాటు వాదనకు దిగుతున్నారని చెప్పారు. దీంతో నిర్వాహకులకు విద్యార్థుల తల్లిదండ్రులకు కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. తమకు బిల్లులు సక్రమంగా రావడం లేదని అందుకే భోజనంలో గుడ్డు పెట్టడం లేదని తెలిపారు. తాము మెనూ ప్రకారం సక్రమంగానే వండి పెడుతున్నామని తమపై కావాలని ఆరోపణలు చేస్తున్నారని నిర్వాహకులు వాపోయారు. గురువారం నుంచి మెనూ ప్రకారం భోజనం అందించే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించి వెళ్లిపోయారు.

క్రీడాపోటీలకు హాజరుకావాలి

గోవిందరావుపేట: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు 14,17ఏళ్ల బాల, బాలికలు హాజరు కావాలని ఏటీడీఓ దేశిరాం నాయక్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నేటి నుంచి కర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ములుగు, వెంకటాపురం(ఎం), గోవిందరావుపేట, తాడ్వాయిలోని ఆశ్రమ, వసతి గృహాల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. కబడ్డీ, ఖో–ఖో తదితర పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కలెక్టర్ దివాకర పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా



ములుగు: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేరుతో ఫేస్‌బుక్‌లో కొంతమంది నకిలీ ఖాతా సృష్టించారు. సమావేశంలో ఉన్నానని అర్జెంటుగా డబ్బులు పంపాలని, పంపిన అమౌంట్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్ షేర్ చేయాలని సైబర్ నేరగాళ్లు యత్నిస్తున్నారు. ఈ విషయాన్ని త్వరగానే గమనించిన కలెక్టర్ స్నేహితులు, బంధువులు, అధికారులు, తెలిసిన వారితో ఈ సమాచారాన్ని పంచుకున్నారు. తన ఫేస్‌బుక్ ఐడీకి ఉజ్బెకిస్తాన్ నుంచి ప్లస్ 998886747021 నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని బుధవారం కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. తనపేరుతో ఎవ్వరు డబ్బులు అడిగినా స్పందించకూడదని, వీలైనంత వరకు ఆ నెంబర్‌ను బ్లాక్ చేయాలని సూచించారు. కలెక్టర్ ఫిర్యాదుతో సైబర్ పోలీసులు నేరగాళ్లను పట్టుకునే పనిలో పడ్డారు.

ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

గోవిందరావుపేట: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఫార్మసిస్టుల సంఘం అధ్యక్షుడు వినోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మసిస్టుల దినోత్సవ కార్యక్రమానికి డీఎంహెచ్ఓ అప్పయ్య ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రణధీర్, గోవిందరావుపేట పీహెచ్‌సీ వైద్యుడు చంద్రకాంత్, యూనియన్ నాయకులు శ్రీనివాస్, హిమకిరణ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో పారదర్శకత పాటించని అధికారులు



ఉపాధ్యాయులతో సంఘాల నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఉపాధ్యాయుల బదిలీల్లో గిరిజన విద్యాశాఖ అధికారులు పారదర్శకత పాటించలేదని గిరిజన ఉపాధ్యాయ జేఏసీ నాయకులు గొప్ప సమ్మారావు, పొడెం కృష్ణప్రసాద్, మైపతి సంతోష్ కుమార్‌లు ఆరోపించారు. మండల పరిధిలోని ఊరట్టం, మేడారం, తాడ్వాయి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో ఉపాధ్యాయ జేఏసీ నాయకులు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని జీఓ నంబర్ 17 విడుదల చేశారన్నారు. ఈ మేరకు ఐటీడీఏ విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా చేపట్టిన బదిలీలు పారదర్శకంగా చేయలేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయకుండా 30:70 ప్రకారం ప్రమోషన్లు కూడా ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. సబార్డినేట్ రూల్స్ చట్టం ప్రకారం చేయకుండా ఇష్టం వచ్చినట్లు బదిలీలు చేశారన్నారు. బదిలీల్లో అన్ని పాఠశాలల్లోని ఖాళీలు చూపించకపోవడంతో సీనియర్ ఉపాధ్యాయులు అవకాశం కోల్పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి, ఐటీడీఏ పరిధిలో సమస్యలు పరిష్కారం చేసుకోవాలని ఆదేశించినా జిల్లాలోని విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రావణాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కుమార్



ఎంపికైన ఉత్సవ కమిటీ సభ్యులు

ములుగు: విజయదశమి పర్వదినం సందర్భంగా ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రావణాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా గంధ్రకోట కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని బొడ్రాయి ఆవరణలో బుధవారం 150 మంది సమక్షంలో ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఓడ రాజుగౌడ్, రాసమల్ల శివాజీ, గుండెబోయిన రమేష్, గాధం కుమార్, అనుముల సురేష్, శ్రీహరి, లింగన్న, ప్రధాన కార్యదర్శులుగా నూనె శ్రీనాథ్, వెంకటయ్యయాదవ్, ప్రవీణ్, సహాయ కార్యదర్శులుగా రాయంచు నాగరాజు, రాజశేఖర్, కన్వీనర్‌గా కుమార్ పాద్య, కోశాధికారిగా జనార్దన్, సహాయ కోశాధికారిగా పాద్య చంటి, ప్రచార కార్యదర్శిగా భూమ నరేష్, మమన్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా అరుణ్, పవన్, అర్జున్, మీడియా ఇన్‌చార్జిలుగా సంఘ రంజిత్, గుగ్గిళ్ల సృజన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు భూ సేకరణ సర్వే

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మందరం చెరువు నుంచి బొమ్మాపూర్ వరకు చిన్నకాళేశ్వరం పనుల్లో భాగంగా నేడు (గురువారం) ఉదయం 9 గంటలకు భూసేకరణ చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్కులు, డాక్యుమెంట్లు తీసుకురావాలని సూచించారు.

చాకలి ఐలమ్మ పోరాటం ఆదర్శం

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



అల్పాహారం చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి

ఏటూరునాగారం: చాకలి ఐలమ్మను పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని వై జంక్షన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని బుధవారం మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య ప్రారంభించారు. అనంతరం రజక సంఘం అధ్యక్షులు ముక్కెర లాలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలను బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగించడానికి ఐలమ్మ పోరాటం సాగించిందన్నారు. నిజాం ప్రభుత్వం ఐలమ్మ భూమిని ఆక్రమిస్తే భయపడకుండా వారిని ఎదిరించిందన్నారు. ఆమె పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది నిజాం నవాబులతో పోరాడి వారిని పారదోలారని తెలిపారు. సీఎం చాకలి ఐలమ్మ పోరాటాన్ని గుర్తించి కోటి ఉమెన్స్ కాలేజీకి ఐలమ్మ పేరు పెట్టడం గర్వించదగ్గ విషయం అన్నారు. అదేవిధంగా హ్యాండ్లూమ్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టినట్లు తెలిపారు. కేవలం పదవులకే శాశ్వతం కాకుండా పోరాట కుటుంబాలకు గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం ఐలమ్మ మనువరాలికి కూడా మహిళా కమిషన్‌లో మెంబర్‌గా చేర్చారని వివరించారు. అలాగే పలువురు విగ్రహావిష్కరణ సభలో 102 జీవో గురించి మాట్లాడగా అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ ఐక్యతగా ఉంటేనే ఏదైనా సాధించగలమని తెలిపారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రైతాంగ పోరాటం మొదలైందన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ గీతె బాబాసాహెబ్‌తో పాటు రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వతాల లాలయ్య, రజక సంఘం సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దాపురం కుమారస్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ దురిశెట్టి చంద్రమౌళి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా నాయకులు వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి చెల్పాక గ్రామానికి చెందిన బోడ లక్ష్మయ్య, బన్నాజీబంధంకు చెందిన అట్టెం నాగేశ్వర్‌రావు, అట్టెం కృష్ణారావులు ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాలను మంత్రి సీతక్క పరామర్శించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ములుగు/ములుగు రూరల్: వసతిగృహాల విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు మంత్రి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని గడిగడ్డ ఎస్టీ బాలికల వసతిగృహాన్ని బుధవారం కలెక్టర్ దివాకరతో కలిసి మంత్రి సందర్శించారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం (ఉప్మా) చేశారు. రోజు ఇలాగే వండుతున్నారా..ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఖాళీ స్థలంలో దసరా సెలవులు పూర్తయ్యే వరకు డైనింగ్ హాల్ షెడ్డును నిర్మిస్తామని తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న ఎస్టీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. దసరాలోపు ఎస్సీ హాస్టల్‌లో సైతం డైనింగ్ హాల్ నిర్మిస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా జాకారం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీల్లో ఫైనల్‌కు చేరిన ఏటూరునాగారం–వాజేడు జట్ల ఫైనల్ మ్యాచ్‌ను మంత్రి సీతక్క, ఎస్పీ శబరీశ్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో వాజేడు జట్టు ప్రథమ స్థానంలో, ఏటూరునాగారం జట్టు ద్వితీయ స్థానంలో విజయం సాధించగా వారికి ట్రోఫీ అందజేశారు. అదే విధంగా మంత్రి జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకరతో కలిసి మంచినీటి సరఫరాపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అలాగే జిల్లాకేంద్రంలో పోలీసు శాఖ తరపున ఏర్పాటు చేసిన సీసీ టీవీ కమాండ్ కంట్రోల్ రూంను ఎస్పీ శబరీశ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ములుగు జిల్లా ప్రారంభమైన మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి మంగపేట మండలంలోని బ్రాహ్మణపల్లి వరకు 370 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వివరించారు. దీంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దుల వరకు విస్తరింపజేశామని తెలిపారు.

ప్లాస్టిక్ డ్రమ్ములు వచ్చేశాయ్



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో మంగళ, శనివారాల్లో నిర్వహించే శని పూజలకు భక్తుల రద్దీ ఉంటుందని, పూజల అనంతరం భక్తులు పాత బట్టలను గోదావరిలో వేయడంతో పారిశుద్ధ్యం పెరిగి దుర్వాసన వస్తుందని ఆలయ సిబ్బంది ఇటీవల దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గోదావరి వద్ద ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని వారు ఆదేశించారు. బుధవారం కాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానం ఈఓ మారుతి ఐదు ప్లాస్టిక్ డ్రమ్ములను కొనుగోలు చేసి, భక్తులు స్నానాలు చేసే చోట ఏర్పాటు చేయడానికి గ్రామపంచాయతీకి ఆ డ్రమ్ములను అందజేశారు. ప్రయోగాత్మకంగా మొదట ఐదు డ్రమ్ములు అమర్చి, వాటిని నిత్యం తొలగిస్తూ ఉండేలా పంచాయతీ సిబ్బందికి సూచించారు.

విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు



వినతిపత్రం ఇస్తున్న ఆర్యవైశ్యులు

కాటారం: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరుతూ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరు మార్పుకు ప్రభుత్వ కెబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరింకోవాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీల కోరిక మేరకు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలిగించి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న ఆర్యవైశ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, కోశాధికారి కముటాల రవీందర్, ఎంఎల్ఎన్ మూర్తి, బచ్చు ప్రకాశ్, అల్లాడి శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, దారం నగేశ్, మద్ది కమల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని కొంపల్లి శివారు 170 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. అసైండ్ భూమిలో రేకుల షెడ్ నిర్మాణాన్ని మూడు రోజుల క్రితం అధికారులు అడ్డుకొని నిర్మాణం కూల్చివేయాలని ఆదేశించారు. నిర్మాణం తొలగించకపోవడంతో పోలీసుల సహాయంతో కూల్చివేశారు. అసైండ్ భూముల్లో నిర్మాణాలు చేపబడితే కూల్చివేయడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు.

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వరంగల్: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణను యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్, సర్వీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ మెకానిజం, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దాజి, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ఉచిత హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల గ్రామీణ/పట్టణ ప్రాంత అభ్యర్థులు ఈనెల 30వ తేదీ ఉదయం 10గంటలకు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థకు హాజరు కావాలని తెలిపారు. వివరాల కోసం 91339 08000, 91339 08111, 91339 08222, 99484 66111 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

స్వరం పడి యువకుడి మృతి

ఖిలా వరంగల్ : ఇంట్లో చాయ్ తాగుతున్న ఓ యువకుడు ఒక్కసారిగా స్వరం పడి.. దగ్గుతూ కుప్ప కూలిపోయాడు. హుటాహుటిన ఎంజీఎంకు తరలించగా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో కళ్ల ముందే చేతికి అందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాదకర ఘటన ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన శీలం బాబురావు చిన్న కుమారుడు రాహుల్ (27) బుధవారం ఉదయం ఇంట్లో టీ తాగుతున్నాడు. ఈక్రమంలో స్వరం పడి దగ్గుతూ కుప్ప కూలిపోయాడు. హుటాహుటిన ఎంజీఎం తరలించారు. వైద్య పరీక్షలు చేయగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తస్మాత్ జాగ్రత్త..

కనిపించని కన్ను చూస్తోంది..

స్పై కెమెరాలతో అప్రమత్తంగా ఉండాలి

- ఇష్టానుసారంగా వినియోగిస్తున్న ఆకతాయిలు
- అనుమానం వస్తే నిశితంగా పరిశీలించాలి
- ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలి
- టెక్నాలజీని మంచికి ఉపయోగిస్తేనే ఫలితం





స్పైకెమెరాల ఏర్పాటుకు అవకాశం ఉండే ప్రాంతాలు

కాజీపేట: టెక్నాలజీ.. మానవాళికి ఎంత మంచి చేస్తోందో.. ఆకతాయిలు, సంఘ విద్రోహుల చేతిలో పడి అంతే చెడు చేస్తోంది. ఫేస్‌బుక్, వాట్సాప్, యూ ట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలను అనుసరించి వ్యాపార అభివృద్ధి, స్నేహం, నాలెడ్జి పెంచుకుంటున్న వారు కొందరైతే.. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల సరఫరా, ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడుతున్న వారు మరికొందరు. కాగా, ఇటీవల ట్రయల్ రూమ్, హాస్టల్ గదుల్లో స్పై కెమెరాలు (సీక్రెట్ కెమెరా) అమర్చిన ఘటనలు వింటున్నాం. విస్తరిస్తున్న టెక్నాలజీని ఇలా అడ్డదిడ్డంగా వినియోగిస్తే తర్వాత జైలుకెళ్లడం ఖాయం. స్వల్ప పరిమాణంలో ఉండే ఈ స్పై కెమెరాలతో ఆకృత్యాలకు ఒడిగడుతున్న వారు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. షాపింగ్ మాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలు..ఇలా పబ్లిక్ ప్రదేశాల్లో ఎక్కడ ఏ కెమెరా కన్ను మనపై ఉందో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. ముఖ్యంగా మహిళలు ఇలాంటి కెమెరాలకు బలవుతున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి. అయితే కాస్త అప్రమత్తంగా ఉండి టెక్నాలజీని ఎలా వినియోగించాలో తెలిస్తే స్పై కెమెరాలను ఇట్టే గుర్తించే వీలుంది. అలా గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్తే ఆకతాయిల పని పట్టేందుకూ అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో స్పై కెమెరా పని విధానం, ఆ కెమెరాను గుర్తించే వివిధ మార్గాల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం..

గుర్తించడం ఎలా?

స్మార్ట్‌ఫోన్లు వాడేవారికి గూగుల్ ప్లే స్టోర్‌లో హిడెన్ కెమెరా డిటెక్టర్ అనే యాప్ చాలా సందర్భాల్లో పనిచేస్తుంది. ఐ ఫోన్లు వినియోగించే వారికి స్పై హిడెన్ కెమెరా డిటెక్టర్ యాప్ ఉపయోగపడుతుంది. స్పై కెమెరాలు వెలువరించే ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను గుర్తించడం ద్వారా గదిని పూర్తిగా డార్క్ చేసినప్పుడు నిర్దిష్ట స్థలంలో కెమెరా ఉందా లేదా అనే విషయం గమనించి మొబైల్ అప్లికేషన్‌లో వాటిని చూపిస్తాయి. స్పై కెమెరాలను గుర్తించడానికి బగ్ డిటెక్టర్ అనే ప్రత్యేక పరికరాలుంటాయి.

మోషన్ డిటెక్షన్, సౌండ్ టెక్నాలజీ..

కొన్ని శక్తివంతమైన స్పై కెమెరాల్లో బ్యాటరీని ఆదా చేయడం కోసం సౌండ్, మోషన్ డిటెక్షన్ టెక్నాలజీ పొందుపరుస్తారు. గతంలో హాస్టళ్లలో జరిగిన ఘటనలు పరిశీలిస్తే ఒక్కొక్కటి సుమారు రూ.3వేల లోపు విలువైన స్పై కెమెరా సౌండ్ యాక్టివేటెడ్ ఫీచర్స్ కలిగి ఉన్నాయి. మహిళలు బాత్‌రూం రావడానికి ముందు డోర్ తీయగానే ఆ శబ్దానికి ఆటోమేటిక్‌గా కెమెరా యాక్టివేట్ అయి వీడియో రికార్డ్ చేస్తుంది. వ్యక్తుల కదలికలను బట్టి దానంతట అదే రికార్డింగ్ అవుతుంది. ఒకసారి చార్జ్‌చేస్తే రెజల్యూషన్ బట్టి నాలుగైదు గంటల పాటు నిరంతరాయంగా ఈ కెమెరాలు వీడియో రికార్డ్ చేస్తాయి.

ఎన్నో రకాలు..

చాలా మంది అనుకుంటున్నట్లు చూడటానికి కెమెరా మాదిరి ఉండదు. మనకు ఏ మాత్రం అనుమానం రాకుండా రకరకాల వస్తువుల రూపంలో రూపొందిస్తారు. అనేక స్పై కెమెరాలను గమనిస్తే జేబులో పెన్, షర్టు బటన్స్, టేబుల్ మీద పెట్టే చిన్న క్లాక్‌లు, రిస్ట్ వాచీలు, ఫ్లవర్ వాజ్‌లు, కీచైన్లు, హ్యాంగర్స్, ఇంట్లో ఉండే ఫొటో ఫ్రేమ్‌లు, మొక్కలు, స్విచ్‌బోర్డులు, బల్బులు ఇలా అనేక విధాలా స్పై కెమెరాలు దొరుకుతున్నాయి.

అనేక రకాల పరీక్షలు..

స్పై కెమెరాలను గుర్తించేందుకు టెక్నిక్స్ ఉన్నాయి. కొన్ని రకాల కెమెరాలున్న ప్రదేశాల్లో ఫోన్ కాల్ చేసేందుకు ప్రయత్నిస్తే అది కాల్ డ్రాప్ అవుతుంది. ఆయా కెమెరాల్లో ఉండే మ్యాగ్నటిక్ తరంగాల వల్ల ఇలా జరుగుతుంది. ఇటీవల కాల్ డ్రాప్ అనేది తరచూ ఎదుర్కొనే సమస్య కావడంతో స్పై కెమెరా ఉందని అనుమానించలేని పరిస్థితి. ఇక ట్రయల్ రూమ్స్‌లో అమర్చే అద్దాలు రెండు రకాలుంటాయి. సహజంగా అద్దం ఒకవైపు మన రూపాన్ని చూపిస్తూ, దాని వెనుక భాగంలో వేరే రంగుతో కోటింగ్ చేయబడి ఉంటుంది. కానీ కొన్ని అద్దాలు పారదర్శకంగా ఉండి, ఇవతలి దృశ్యాలను అవతలికి చూపిస్తుంటాయి. మీకు అలాంటి అనుమానం వస్తే అద్దంలో కొద్దిగా ఖాళీ స్థలం ఉండాలి. అలా కాకుండా రెండు టచ్ అయినట్లు ఉంటే ఆ అద్దం అవతలి వైపు మీ దృశ్యాలను చూపిస్తుందని గ్రహించాలి. లైట్లన్నీ ఆఫ్ చేసి, ఫ్లాష్ లైట్‌ని అద్దం మీద వేసినప్పుడు అవతలి వైపు ఏదైనా ఉందేమో తెలుస్తుంది.

స్పై కెమెరాలతో ప్రమాదాలు

స్పై కెమెరాల ద్వారా మహిళల నగ్న దృశ్యాలను రికార్డ్ చేసి వాటిని పోర్న్ సైట్లలో అప్‌లోడ్ చేస్తున్న వారు ఇటీవల అధికమవుతున్నారు. మరికొంత మంది ఆ వీడియోలను సంబంధిత మహిళలకు పంపించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఎక్కడైనా ఇలా అనుమానాస్పదంగా ఉన్న స్పై కెమెరాలను గుర్తిస్తే వాటికి సంబంధించిన ఆధారాలను స్మార్ట్ ఫోన్లో వీడియో, ఫొటోల రూపంలో రికార్డు చేయాలి. సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. షాపింగ్ మాల్స్ వంటి వాటిలో ఫ్లోర్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాలి. వీడియో ఫుటేజీ రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తుంటే, వెంటనే కుటుంబ సభ్యులతో చర్చించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం మంచిది. వృత్తి, ఉద్యోగాల్లో భాగంగా చాలా మంది మహిళలు నగరాల్లో హాస్టల్స్‌లో ఉంటున్నారు. వారు ఉండే గదులు, బాత్‌రూమ్‌లను నిశితంగా పరిశీలించాలి. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ స్పై కెమెరాలకు చెక్ పెట్టాలి.

మొబైల్స్‌తోనూ..

స్పై కెమెరాలు మాత్రమే కాదు, నిరంతరం మొబైల్ ద్వారా కూడా పబ్లిక్ ప్లేస్‌ల్లో మహిళల కదలికలు రికార్డు చేస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఎవరికీ అనుమానం రాకుండా ప్రివ్యూ కూడా కనిపించకుండా బ్యాక్ గ్రౌండ్‌లో వీడియోని రికార్డ్ చేసే యాప్స్‌ని వాడుతున్నారు.

భద్రు నాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, పక్కన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో చిరు ఉద్యోగిగా చేరి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి వివిధ పాలన పదవులను నిజాయితీగా నిర్వర్తించిన హిస్టరీ విభాగం దివంగత ప్రొఫెసర్ భద్రునాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు కోరారు. ఇటీవల మృతి చెందిన కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ భద్రునాయక్ సంస్మరణ సభను బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో నిర్వహించారు. ఈ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబం నుంచి వచ్చిన భద్రునాయక్ కేయూలో విద్యార్థులను తీర్చిదిద్దటంతోపాటు అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావుపూలే ఆలోచనలను చైతన్యం చేసేందుకు వివిధ సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. భద్రునాయక్ మృతి అట్టడుగు, బడుగు, బలహీనవర్గాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. నిబద్ధతతో సమాజం కోసం పనిచేసిన ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని, అప్పుడే భద్రునాయక్‌కు నిజమైన నివాళి అన్నారు. పీఠం డీన్ భుక్యాబాబురావు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కె. వెంకటనారాయణ, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి, అంబేడ్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు సుదర్శన్, గిరిజన సామాజిక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్, కుర్తా జనరల్ సెక్రటరీ వడ్డె రవీందర్,రిటైర్డ్ ఆచార్యులు విజయబాబు,ఎం.సారంగపాణి, ఎం. ఎర్రగట్టుస్వామి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్ లాల్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మిద్దే ఎల్లయ్య, మానవహక్కుల వేదిక బాధ్యుడు బాదావత్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి శవమై తేలి..

- అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో మహిళ ఆత్మహత్య



సుక్కమ్మ మృతదేహం

రఘునాథపల్లి: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని యాపలగడ్డతండా శివారు చర్లతండాకు చెందిన గుగులోత్ సుక్కమ్మ (46) కొంతకాలంగా మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. అలాగే, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన సుక్కమ్మ.. మంగళవారం ఇంటి నుంచి వెళ్లి సమీపంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా జాడలేదు. బుధవారం ఉదయం తండాకు చెందిన గుగులోత్ భద్రు పొలం వద్దకు వెళ్తుండగా రిజర్వాయర్‌లో సుక్కమ్మ శవం తేలియాడుతూ కనిపించింది. స్థానికులు, పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి కుమారుడు గుగులోత్ పరమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

కుటుంబ కలహాలతో కిష్టగూడెంలో వ్యక్తి..



మల్లేశం (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని కిష్టగూడెం గ్రామానికి చెందిన మేకల మల్లేశం (48) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మల్లేశం మద్యానికి బానిసై రోజు తాగడం, అనారోగ్యానికి గురవుతుండగా భార్య రేణుక వద్దని చెప్పడంతో ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మల్లేశం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

రైల్వే నో పార్కింగ్ జోన్‌లో పార్క్ చేయొద్దు

- కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిధిలో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా నిషేధిత రైల్వే ప్రాంతంలో రైల్వే ఉద్యోగులైనా, ప్రైవేట్ వ్యక్తులైనా పార్క్‌చేస్తే వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ అవసరాల కోసం కాజీపేట జంక్షన్‌కు వచ్చిన వారు తమ వాహనాలు, కార్లను రైల్వే సర్క్యులేటింగ్ ఏరియాలోని నో పార్కింగ్ జోన్‌లో పార్క్ చేస్తున్నారన్నారు. ఈ దృశ్యాన్ని ఇటీవల తనిఖీల నిమిత్తం కాజీపేట జంక్షన్‌కు విచ్చేసిన రైల్వే సీనియర్ డీసీఎం చూసి సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ ఆదేశాలనుసారం రైల్వే నో పార్కింగ్ జోన్‌లో ఇక మీదట ఎవరూ పార్క్ చేయొద్దన్నారు. ఒకవేళా పార్క్ చేస్తే రైల్వే యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. కొందరి రైల్వే అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు తెలిపారు.

మాజీ సర్పంచ్ నరేశ్ అరెస్ట్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం ఇస్లావత్ తండా గ్రామ మాజీ సర్పంచ్ ఇస్లావత్ నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని కురవి ఎస్సై గండ్రాతి సతీశ్ బుధవారం తెలిపారు. నరేశ్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఉప సర్పంచ్ ఇస్లావత్ రంగమ్మ సంతకం ఫోర్జరీ చేసి రూ.49 వేలు బ్యాంకు నుంచి డ్రా చేసిన విషయంలో అప్పటి ఎంపీఓ హరిప్రసాద్ విచారణ చేపట్టి కురవి పీఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఉప సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసింది వాస్తవమే అని ల్యాబ్ రిపోర్టురాగా ఆ కేసు విషయంలో నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మినీ జాతర పనులు మహాజాతరకు పనికొచ్చేలా ఉండాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి ధనసరి సీతక్క

ములుగు: మేడారం మినీజాతర–2025 విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో మినీజాతర నిర్వహణపై కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీశ్, డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్‌తో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మినీ జాతర పనులు వచ్చే 2026 మేడారం మహాజాతరకు పనికొచ్చేలా ఉండాలన్నారు. మహా జాతర సమయంలో వందల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నా శాశ్వతంగా ఉండకపోవడంతో వచ్చే జాతరకు మళ్లీ అవే పనులు చేపట్టాల్సి వస్తోందన్నారు. ఇప్పటి నుంచి చేసే ప్రతి పని దీర్ఘకాలికంగా ఉండేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పర్శ్ పథకాన్ని ప్రవేశపెట్టిన దృష్ట్యా జాతర పనులకు నిధులు వచ్చే అవకాశం ఉందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆ నిధులతో అమ్మవారి గద్దెల చుట్టూ ఫ్లోరింగ్ చేయడంతోపాటు నిత్యం మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పించే బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. 2022 మహాజాతరలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, మేడారం ఆలయ ఈఓ రాజేంద్రం, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలు అవసరం

- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ గీత వేముగంటి



ప్రొసీడింగ్స్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ గీత వేముగంటి, ఇతర ఆచార్యులు

కేయూ క్యాంపస్: కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ గీత వేముగంటి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ అనిమల్ సైన్సెస్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న జాతీయ సదస్సును రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గీత వేముగంటి కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై కీలకోపన్యాసం చేశారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడం వల్ల అవి కేన్సర్ కణాలుగా మారుతాయని, ఇలాంటి కణాలు శరీరంలోని ఇతర భాగాలకు కూడా వ్యాప్తి చెంది చివరికి కేన్సర్ చివరి దశలో ప్రాణాపాయ స్థితిలోకి సంభవిస్తుందన్నారు. అందుకే కేన్సర్‌కు సంబంధించిన మూల కణాలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిశోధనల ఫలితాలే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను సమకూర్చే వీలుంటుందన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకెళ్తోందని, విద్యార్థులు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలన్నా రు. ఈ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య జి. షమిత, ఆ విభాగం ఆచార్యులు వై. వెంకయ్య, ఈసం నారాయణ, మామిడాల ఇస్తారి మాట్లాడారు. ఈసెమినార్‌లో ప్రొసీడింగ్స్‌ను విడుదల చేశారు. కాగా, రెండురోజులపాటు వివిధ చోట్ల నుంచి వచ్చిన వారు పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. ఈనెల26న సాయంత్రం ముగియనున్నది.

చిరుత పులి చర్మం స్వాధీనం

- పోలీసుల అదుపులో ఛత్తీస్‌గఢ్ వాసి



చిరుత పులి చర్మాన్ని చూపిస్తున్న పోలీసులు

వాజేడు: ఛత్తీస్‌గఢ్ నుంచి అక్రమంగా చిరుతపులి చర్మాన్ని తీసుకువస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ములుగు ఓఎస్‌డీ, ఏటూరునాగారం ఇన్‌చార్జ్ ఏఎస్పీ మహేష్ గీతె బాబా సాహెబ్ బుధవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ నుంచి చిరుతపులి చర్మాన్ని తెలంగాణకు తీసుకువస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చంద్రుపట్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్, వాజేడు రేంజర్ చంద్రమౌళి, అటవీశాఖ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో నంబర్ లేని ద్విచక్రవాహనంపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వైపు నుంచి వస్తున్న జాడి మహేందర్ అనే వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న బ్రౌన్ కలర్ సంచిలో చిరుత పులి చర్మం లభించింది. రేంజర్ పరిశీలించి నిజమైన చిరుత పులి చర్మంగా నిర్ధారించారు. మహేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తనది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, భూపాలపట్నం తహసీల్ పరిధిలోని ఊట్లూరుగా వెల్లడించాడు. అతడినుంచి మొబైల్, ద్విచక్రవాహనం, చిరుత పులి చర్మాన్ని స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ కోసం రేంజర్‌కు అప్పగించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే కేసులు


- సివిల్ సప్లై స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్




మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మహబూబాబాద్: ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ ఓఎస్‌డీ ఎం. ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం మానుకోట మున్సిపాలిటీ పరిధి అనంతారం శివారులోని సాయి శ్రీనివాస రైలుమిల్లుపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన మరిపెడ మండలం ఎల్లంపేటలోని ఓ రైలు మిల్లులో, 21న కురవి మండలం మొగిలిచర్లలోని నవ్య ఇండస్ట్రీస్‌పై, ఈనెల 24వ తేదీన పెద్దగూడూరు మండలం అప్పరాజుపల్లిలోని రాజరాజేశ్వర రైలు మిల్లులో తనిఖీలు చేశామన్నారు. ఈ మిల్లుల్లో ధాన్యం లేకపోవడంతో క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ నెల 25వ తేదీన సాయి శ్రీనివాస ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేయగా మిల్లుతో పాటు మరో రెండు గోదాంల్లో ధాన్యం నిల్వ చేశారన్నారు. 88 వేల, 96 క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా కొంత కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇచ్చారన్నారు. ఇందులో 82వేల క్వింటాళ్ల ధాన్యం ఉండాల్సి ఉండగా సుమారు 54వేలు మాత్రమే ఉందని, సుమారు 20 వేల క్వింటాళ్ల ధాన్యం తక్కువ ఉందన్నారు. కాగా, ఇప్పటి వరకు ఈ మిల్లు యాజమాన్యం రూ. 2 కోట్ల 58 లక్షలు చెల్లించారని, మిగతా డబ్బులు చెల్లించేందుకు మూడు రోజుల సమయం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ ప్రేమ్‌కుమార్, మేనేజర్ కృష్ణవేణి, ఏఎస్ఓ రమేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను ఖాళీ చేయించిన అధికారులు



శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళ



ఆరుబయట ఉన్న బాధితుల సామగ్రి

- ఆత్మహత్యాయత్నం చేసిన మహిళలు
- సామగ్రితో ఆరుబయటే ఉన్న బాధితులు

పాలకుర్తి టౌన్: మండలంలోని తొర్రూరు(జె)లో గత ప్రభుత్వం నిర్మించిన 20 డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆక్రమించుకోవడంతో బుధవారం రెవెన్యూ, పోలీసు, జీపీ సిబ్బంది ఖాళీ చేయించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసం ఉంటున్న పసులాది అంజమ్మ, పద్మ, గడ్డం భూలక్ష్మి, జోడు ఇందిర, గడ్డం ప్రజాపతి శరీరంపై పెట్రోల్ పోసుకుని నిరసన తెలుపుతూ ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఇళ్లను ఖాళీ చేయబోమని పట్టు బట్టడంతో ఉద్రిక్తత వాతావరణంలో అధికారులు ఖాళీ చేయించి తాళాలు వేసి సీల్ వేశారు. దీంతో బాధితులు సామగ్రితో ఆరుబయటే ఉన్నారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, పాలకుర్తి, దేవరుప్పుల ఎస్సైలు యాకూబ్ హుసేన్, సృజన్, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐ రాకేశ్, పంచాయతీ కార్యదర్శి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి..

ఎనిమిది నెలల నుంచి డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉంటున్న అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఆ ఇళ్లు కేటాయించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి డిమాండ్ చేశారు. తొర్రూరు గ్రామ డబుల్ బెడ్ రూం ఇళ్ల బాధితులతో కలిసి బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మాచర్ల ఎల్లయ్య, నాయిని మల్లారెడ్డి, పాము శ్రీను, పసులాది శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక


ఇల్లందుల హరినాథ్

రవికిరణ్

మంగపేట : పీఆర్‌టీయూ టీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇల్లందుల హరినాథ్, ప్రధాన కార్యదర్శిగా పాలడుగుల రవి, అసోసియేట్ అధ్యక్షుడిగా చెన్నూరి రవికిరణ్, మహిళా అసోసియేట్‌గా జి.శాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్, ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పాలిట గుదిబండగా మారిన జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వర్క్ అడ్జెస్టిమెంట్ జీఓ 25ను రద్దు చేసి అనుబంధ విధి విధానాలను రద్దుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

దాతల చేయూత



కన్నాయిగూడెం : మండలంలోని ఏటూరు గ్రామ పంచాయతీకి చెందిన కొక్కిరెక్కల జమున ఊపిరితిత్తుల సమస్యతో వైద్యం పొందుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి డబ్బులు లేక దాతలు ఆదుకోవాలని వేడుకోగా ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు హనుమకొండలో చికిత్స పొందుతున్న జమునకు అబ్బు సతీష్ ఆధ్వర్యంలో రూ.20,150లు అందించారు. ఈ కార్యక్రమంలో నరెడ్ల సాయి, తదితరులు పాల్గొన్నారు

'విగ్రహ ఆవిష్కరణకు రండి'

● ఆహ్వానపత్రం అందజేత



ములుగు : ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో అక్టోబర్ 9వ తేదీన ఏటూరునాగారం మండలకేంద్రంలో నిర్వహించనున్న కొమురంభీం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ సంఘం సభ్యులు బుధవారం మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్‌లను జిల్లాకేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ పోడెం రత్నం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింత కృష్ణ, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటి రవి, మంకిడి రవి, అన్నవరం రవికాంత్, వట్టం జనార్దన్, చందా మహేష్, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌మన్‌లకు శిక్షణ



వాజేడు : మండలంలోని మిషన్ భగీరథ పంపు ఆపరేటర్లకు (వాటర్‌మన్) బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. డీఈఈ సతీష్, ఏఈ శైలజ, ములుగు పంపు ఆపరేటర్ తాగునీటి సరఫరా, మరమ్మతులపై వివరించారు. పైపులైన్ మరమ్మతులకు గురైన సమయంలో ఎలా మరమ్మతులు చేయాలి, గేట్‌వాల్వ్‌లు ఎలా బాగు చేయాలో తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

రేగొండ : రేగొండ సెకండ్ ఎస్సైగా శంకరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిట్యాల ఏఎస్సైగా పని చేసిన ఆయన పదోన్నతిపై రేగొండ సెకండ్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజా సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేస్తాం

భూపాలపల్లి అర్బన్ : నంబర్ ప్లేట్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నంబర్ ప్లేట్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలను పట్టుకొని జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


వాజేడు: విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు


వాజేడు: దోమలమందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

వాజేడు : సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రగళ్లపల్లి పల్లెదవాఖానా వైద్యాధికారి గ్యానస సూచించారు. మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి కొత్తూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 42 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు వెల్లడించారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. గర్భిణీలతో పాటు బాలింతలు, క్షయ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. వారికి నెలకు సరిపడ మందులను పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను తెలుసుకున్నారు. రెండో విడత దోమల మందును గ్రామంలోని ఇళ్లల్లో పిచికారీ చేయించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరం వస్తే తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి వైద్యం చేయించుకోవాలని కోరారు. జ్వరాల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కోటిరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


వెంకటాపురం(కె): పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంటింటా ఫీవర్ సర్వే

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని చొక్కాల, రంగరాజపురం, నూగూరు, వీరభద్రవరం, ఆలుబాక గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది సభ్యులు ఉంటున్నారు.. వారిలో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అనే విషయాలపై సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహ, ఆశీష్, వినయ్, సిబ్బంది మనోహర్, సత్యనారాయణ, విమల, భారతి, సుశీల, స్వరూప,పార్వతి తదితరులు ఉన్నారు.

ఎంఈఓలుగా బాధ్యతలు


ఎస్ఎస్‌తాడ్వాయి: కేశవరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


మంగపేట: పాడెం మేనక

ఎస్ఎస్‌తాడ్వాయి : తాడ్వాయి ఇన్‌చార్జ్ ఎంఈఓగా రేగ కేశవరావును నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. తాడ్వాయి ఇన్‌చార్జ్ ఎంఈఓగా పనిచేసిన యాప సాంబయ్య బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మండల కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎంగా పని చేస్తున్న కేశవరావును ఎంఈఓగా నియమించారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, సీఆర్పీలు కేశవరావును పూలమాలతో సత్కరించారు. మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మంగపేట ఎంఈఓగా మేనక

మంగపేట : మండల విద్యాశాఖ అధికారిగా పాడెం మేనక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమెను ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తు విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. బాధ్యతలు స్వీకరించిన మేనకకు ఎమ్మార్సీ సిబ్బంది పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు చందా భద్రయ్య, మద్దెల నాగేశ్వర్ రావు, పురుషోత్తం, సురేష్ నాయక్, రాంబాబు, విష్ణుమూర్తి, నాగభూషణం శాలువాతో సత్కరించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏటూరునాగారం ఎంఈఓగా మల్లయ్య

ఏటూరునాగారం : మండల విద్యాశాఖ అధికారిగా కొయ్యడ మల్లయ్యను డీఈఓ నియమించారు. రామన్నగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లయ్య ఎఫ్ఏసీగా ఏటూరునాగారం ఎంఈఓగా విధుల్లో చేరారు. ఈ మేరకు మండల విద్యావనరుల కేంద్రంలో మల్లయ్యను హెచ్‌ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు సుమన్, శ్రావణ్, సిబ్బంది శ్రీధర్‌నాయక్, సత్యారావు, విజయ్, ఐఈఆర్‌పీ స్వరూపరాణి, చందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



గోవిందరావుపేట : భారతీయ జనతా పార్టీ మూల సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను మండలంలోని పస్రాలో నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మండల కన్వీనర్ సతీష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించగా జిల్లా అధ్యక్షుడు బలరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవిత కాలం పని చేసిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రాచారి, జాడి వెంకట్, లవన్, రవీందర్‌రెడ్డి, క్రిష్ణాకర్, సురేష్, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, సాంబశివరెడ్డి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందీ టీచర్‌ను నియమించాలి

కన్నాయిగూడెం : మండలంలోని గుర్రేవుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌ను వెంటనే నియమించాలని మాజీ వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్ అన్నారు. విద్యార్థులకు హిందీ సబ్జెక్టు తరగతులు ఆగిపోయినట్లు వెల్లడించారు. వెంటనే డీఈఓ, కలెక్టర్ చొరవ తీసుకోని గుర్రేవుల పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

చిట్యాల: వీఆర్‌ఏ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమకు వీఆర్‌ఏలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీఓలతో ప్రమోషన్ పొంది తక్కువ సర్వీస్ చేసి ఏలాంటి బెనిఫిట్స్ పొందకుండా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. 61 సంవత్సరాలు దాటిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగం కల్పించాలని, 55 నుంచి 61 సంవత్సరాల మధ్యలో ఉన్న వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలన్నారు.అలాగే దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చిన వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నర్సయ్య, సతీష్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులు కల్పించాలి


లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్ : ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిసరాలలో నీటినిల్వల కారణంగా పాకురు ఏర్పడి విద్యార్థులు జారి పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. వార్డెన్ సరిగా విధులు నిర్వర్తించకపోవడంతో విద్యార్థులు రాత్రి వేళ రోడ్లపై తిరుగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, కిరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కవచంతో గీతకార్మికులకు ప్రయోజనం



కాటారం : కాటమయ్య రక్షణ కవచంతో కల్లు గీత కార్మికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య అన్నారు. మండలంలోని ధన్వాడలో ఎక్సైజ్ శాఖ, బీసీ సంక్షేమ శాఖ సమన్వయంతో బుధవారం కాటమయ్య రక్ష కవచం ఉపయోగాలపై కల్లుగీత కార్మికులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని 134మంది కల్లు గీత కార్మికులకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారితో రక్షణ కవచం ఉపయోగించు తీరును వివరించారు. గీతకార్మికులు రక్షణకవచం ధరించి తాటిచెట్లు ఎక్కడం ద్వారా ప్రమాదాలబారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైతో పాటు సిబ్బంది రాంచందర్, వెంకట్‌రాజ్, కోటేశ్వర్, ట్రెయినర్స్ జశ్వంత్, తిరుపతి, అంజన్న, అశోక్, వెంకట్రాజం, గీత కార్మికులు చీటూరి లింగంగౌడ్, మార్క రవీందర్, కారెంగుల వెంకటరాజం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థినులు

ములుగు రూరల్ : పరకాల మండలం నర్సక్కపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 1998–99ం సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థినులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని బండారుపల్లి గిరిజన భవన్‌లో పూర్వ విద్యార్థినులు సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. గురుకుల పాఠశాల జ్ఞాపకాలను తలుచుకుంటు సరదాగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు వినోద, ఉపేంద్ర, అరుణ, వాణి, సునీత, శైలజ, లత, నూర్జహాన్, రేణుక, కళ్యాణి, క్షమతి, కవితతో పాటు 60 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

'పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దు'



ఏటూరునాగారం : తెలుగు యూనివర్సిటీకి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించవద్దని ఆర్యవైశ్య నాయకులు బుధవారం మండల కేంద్రంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం అవివేకమన్నారు. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సిద్దంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. నాయకులు బచ్చు సత్యనారాయణ, బోలసాని గౌరీశంకర్, వెలుగందుల మాధవ్, నాగేశ్వరరావు, నూక ప్రభాకర్, ఏటూరునాగారం, మంగపేట, మహాసభ అధ్యక్షుడు బచ్చు సతీష్, అనంతుల కృష్ణమూర్తి, గంజి రమేష్, గుంత రమేష్, మడుగురి ప్రసాద్, సిరిపురం చందు, బచ్చు శేఖర్ ,అమర సందీప్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాణి

గోవిందరావుపేట : మహిళా సాధికారతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. మహిళా అభివృద్ధి కోసం పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం


సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

ములుగు రూరల్ : దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని పార్టీ రాష్ట్ర నాయకురాలు గుగులోత్ స్వరూప అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గుర్తూర్‌తండా, మాన్సింగ్‌తండా, చంద్రుతండా గ్రామాల్లో మండల సభ్యత్వ ప్రముఖ్ మహేందర్ ఆధ్వర్యంలో సభ్యత్వం చేపట్టగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను తండావాసులకు వివరించారు. దేశంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు రాష్ట్ర ప్రజలకు సులువుగా చేరుతున్నాయని తెలిపారు. సభ్యత్వ నమోదులో యువత ముందుండాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాదం కుమార్, దాసరి వెంకటేశ్‌యాదవ్, హరీష్, నరేష్, బండి ఓదెలు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలి


నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

ఏటూరునాగారం : బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఈనెల28న ఐటీడీఏ ఆవరణలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు గొప్ప సమ్మారావు, పొదెం కృష్ణప్రసాద్‌లు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాల జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఉపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్లుగా గిరిజన సంక్షేమశాఖలో బదిలీలు, పదోన్నతులు లేక అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏలో సుమారు 41 పోస్టులు ఖాళీగా ఉన్న ఐదు పోస్టులు మాత్రమే పదోన్నతి కల్పించి మిగతా పోస్టులకు అర్హులు ఉన్నప్పటికీ పదోన్నతి కల్పించలేదన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ఐటీడీఏ డీడీ పోచంను తొలగించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఎదుట జరిగే ధర్నాకు ఐటీడీఏ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

గోవిందరావుపేట : ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పస్రాలో సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిర్వహించిన సీపీఎం గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యలను స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీపీఎం గతంలో రక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలకు అందిస్తే తర్వాత వచ్చిన సర్పంచ్ ఆచరణలో పెట్టడంలో విఫలమయ్యారని అన్నారు. గ్రామాలలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో 570 మందికి ఇళ్ల స్థలాలను పంచడం జరిగిందని చెప్పారు. నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, ఆగిరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, సాంబశివ, రాజేందర్, పోశాలు, రాజేష్, రాజేందర్, పురుషోత్తం రెడ్డి, ఆదిరెడ్డి, రాజు, మురళి, అరుణ్, రాజేశ్వరి, రజిత, కవిత, సువర్ణ, శారదలు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట భూములు లాక్కోవద్దు


ట్రెంచ్ పనులు అడ్డుకుంటున్న రైతులు

ములుగు రూరల్ : అభివృద్ధి పనుల పేరుతో 40ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన భూమిని లాక్కోవద్దని ఇంచర్ల, బంజరుపల్లి, జంగాలపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ అభివృద్ధి పనుల నిమిత్తం పొక్లెయినర్ సహాయంతో భూమిలో కందకాలు (ట్రెంచ్) తీసేందుకు వెళ్లగా రైతులు అడ్డు తగిలారు. దీంతో రెవెన్యూ అధికారులకు, రైతులకు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 40ఏళ్ల క్రితం నిరుపేద కుటుంబాలకు చెందిన 39 మందికి ప్రభుత్వం భూపంపిణీ చేసిందని తెలిపారు. అప్పటి నుంచి సాగు చేస్తున్న క్రమంలో కొంత మంది రైతులు భూములు తమవంటూ రావడంతో గొడవలు జరిగాయని అన్నారు. గత ప్రభుత్వం పట్టాలు జారీ చేసిన రైతులకు అందించలేదని చెప్పారు. దీంతో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూమిని తీసుకోవద్దని వేడుకున్నారు.ఈ విషయంపై ఆర్ఐ యుగేందర్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.